క్లుప్తంగా

సింహగిరిపై నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



సింహగిరిపై సాముహిక వరలక్ష్మీ వ్రతాలకు సిద్ధం చేసిన వేదిక

సింహాచలం: శ్రావణ శుక్రవారంను పురస్కరించుకుని సింహగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు ఆలయ మాడ వీధిలో పెద్ద ఎత్తున వేదిక ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 7 నుంచి మూడు బ్యాచ్‌ల్లో వ్రతాలను నిర్వహించనున్నారు. వ్రతాల్లో పాల్గొనేందుకు గురువారం సాయంత్రానికి 1500 మంది వరకు మహిళలు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వ్రతాల్లో పాల్గొనే మహిళలకు కొండ దిగువ నుంచి కొండపైకి, కొండపై నుంచి కొండదిగువకు దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణం, స్వామివారి ఉచిత దర్శనం, పూజాసామగ్రి ఉచితంగా అందించనున్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం అంతకంటే ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులై నెట్/స్లెట్/పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు వారి విద్యార్హత, బోధానుభవం, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ సెట్‌తో డెమో క్లాస్‌కు సిద్ధపడి ఈ నెల 23న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాల్సిందిగా కోరారు.

'అప్సా' నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



అప్సా నూతన కార్యవర్గం

పెందుర్తి: ఆంధ్రప్రదేశ్ ప్రవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) పెందుర్తి నియోజకవర్గ యూనిట్ నూతన కార్యవర్గం కొలువుదీరింది. అధ్యక్షుడిగా బీఎస్ రావు, కార్యదర్శిగా ఎం.రాంప్రసాద్, కోశాధికారిగా ఎస్.రమణ, ఇతర కార్యవర్గ సభ్యుల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వీరిచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ ఎన్నికల ప్రక్రియలో అప్సా ప్రతినిధులు మురళీమనోహర్, మూర్తి, బాలాజీ నాగేశ్వరరావు, కోనేటి ఆదినారాయణ(నానీ సర్) తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.3.40 లక్షల జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 34 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.3.40 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. గురువారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో శ్రావణ మాసం ఆఖరి గురువారం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్ ఆధ్వర్యంలో సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులందరితో లలితా సహస్ర నామాలు, సాయి సచ్చరిత పారాయణం చేయించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సాయినాథుడికి పూజలు జరిపారు.

కలుషిత మేహాద్రి

'మేహాద్రి రిజర్వాయర్ కట్టి దాదాపు 40 ఏళ్లు కావస్తుంది బాబూ.. పదేళ్ల క్రితం వరకు పశువుల్ని మేతకు తోలుకెళ్లి రిజర్వాయర్‌లో నీటిని నేరుగా తాగే వాళ్లం. ఏ ఇబ్బందీ ఉండేది కాదు. కానీ ఇప్పుడు రిజర్వాయర్ నీటిని చూస్తే భయమేస్తోంది. పశువుల కాళ్లు, ఫారం కోళ్ల వేస్ట్, మురుగు నీటి కంపు ఎక్కువగా ఉంది. తాగడానికి కాదుకదా తాకడానికి కూడా భయంగా ఉంది. ఇలాగే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో జనం విషపు నీటినే తాగాలి'

– మేహాద్రి రిజర్వాయర్ నిర్వాసిత రైతు ఆవేదన



పెందుర్తి పరిసర ప్రాంతాల నుంచి మేహాద్రి రిజర్వాయర్‌కు చేరుతున్న మురుగు నీరు





పెందుర్తి: ఒకప్పుడు స్వచ్ఛమైన నీటికి మారుపేరుగా ఉన్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ప్రమాదకర రీతిలో కలుషితమవుతోంది. నగరంలో మూడో వంతు ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన ఈ రిజర్వాయర్.. ప్రస్తుతం మురుగు నీటికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. సాధారణ చెత్తతో పాటు అత్యంత ప్రమాదకరమైన పశువులు, మేకలు, కోళ్లు, కుక్కలతో పాటు ఇతర జంతువుల కళేబరాలు రిజర్వాయర్‌లోనే కలుస్తున్నాయి. మేహాద్రి పరీవాహక ప్రాంతంలోని ప్రజల వాడుక నీరంతా రిజర్వాయర్‌లోకే చేరుతోంది. ఈ క్రమంలో లక్షలాది మంది ప్రజల దాహార్తిని తీర్చే మేహాద్రి కలుషిత కాసారంగా మారుతోంది.

నాలుగు దశాబ్దాల చరిత్ర

నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాదాపు 40 ఏళ్ల క్రితం మేహాద్రి రిజర్వాయర్ నిర్మాణం జరిగింది. పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెం, నరవ, చింతగట్ల, పెదగాడి, చింతలగ్రహారం, రాంపురం గ్రామాలకు చెందిన వేలాది ఎకరాలను రైతులు వదులుకున్నారు. మేహాద్రి ఏర్పాటుతో నగరంలోని మూడో వంతు ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు పలు కంపెనీల అవసరాలను కూడా తీరుస్తోంది. నగరంలో నివాసాలు పెరుగుతున్న క్రమంలో మేహాద్రికి ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్న తాటిపూడి, రైవాడల సరసన మేహాద్రి కూడా చేరింది.

కొరవడిన పర్యవేక్షణ

మేహాద్రి రిజర్వాయర్‌పై పర్యవేక్షణ దాదాపు కొరవడింది. మైదాన ప్రాంతాల్లోని వర్షపు నీటిని పది చిన్నా పెద్దా కాలువలు మేహాద్రికి చేరుస్తాయి. ఇటు పెందుర్తి రైల్వే వంతెన సమీపం నుంచి చింతలగ్రహారం ప్రధాన కాలువ ద్వారా.. అటు సబ్బవరం బొర్రమ్మగెడ్డ ద్వారా అధికశాతం నీరు మేహాద్రికి వస్తుంది. ఆయా కాలువలే ప్రస్తుతం నీటి కలుషితానికి కేంద్రాలుగా మారుతున్నాయి. పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల నుంచి పశువులు, కోళ్ల వ్యర్థాలతో పాటు, నివాసాల నుంచి వస్తున్న మురుగు నీరు ఈ కాలువల్లోకే చేరుతోంది. దీంతో పాటు చింతలగ్రహారం సమీపంలోని రిజర్వాయర్ ప్రధాన కాలువలో నిత్యం టన్నుల కొద్దీ చెత్త వేస్తున్నారు. ఆ చెత్తాచెదారం, విషపూరిత వ్యర్థాలు మురుగు నీటితో కలిసి రిజర్వాయర్ గర్భానికి చేరుకుంటున్నాయి. దీంతో రిజర్వాయర్ పూడికతో పేరుకుపోయింది. నీటి పారుదల శాఖ, జీవీఎంసీ సమన్వయలోపంతో పర్యవేక్షణ గాలికి వదిలేశారన్న ఆక్షేపణలున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మేహాద్రి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మేహాద్రి విస్తీర్ణం: 15 వేల ఎకరాలు
జీవీఎంసీకి నీటి సరఫరా: 8 నుంచి 10 ఎంజీడీలు
(మింది వద్ద ఉన్న నీటి శుద్ధి కేంద్రం నుంచి గాజువాక, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, భెల్ ప్రాంతాలకు జీవీఎంసీ సరఫరా చేస్తుంది.)

కలుషితానికి కారణాలివే..

- మేహాద్రి పరీవాహక ప్రాంతంలో అనధికారిక నిర్మాణాలతో వాటి నుంచి వ్యర్థాలు/మురుగు నేరుగా రిజర్వాయర్‌కు చేరుతోంది.
- దాదాపు 15 ఏళ్ల నుంచి రిజర్వాయర్‌లో పూడిక తీయలేదు.
- ప్రస్తుతం మేహాద్రి ప్రధాన కాలువతో పాటు పిల్ల కాలువలు, మేహాద్రి గర్భం కూడా గుర్రపు డెక్క, ఇతర పిచ్చితుప్పలతో నిండి ఉంది.
- మురుగును, వ్యర్థాలను మేహాద్రికి చేరకుండా నియంత్రించాల్సిన జీవీఎంసీ విఫలం కాగా, మేహాద్రిని పూర్తిస్థాయిలో పర్యవేక్షించాల్సిన నీటి పారుదలశాఖ కూడా నిర్వహణను గాలికి వదిలేసింది.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం



మేహాద్రిలో వ్యర్థాలు, మురుగు నీటి చేరికపై ఫిర్యాదులు వస్తున్నాయి. తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మేహాద్రికి సబంధించి సుందరీకరణ పనులు చేపట్టాం. పూర్తిస్థాయి పర్యవేక్షణ బాధ్యత మాది కాదు. మేహాద్రి అభివృద్ధి, పర్యవేక్షణ అంశాలపై సంబంధిత శాఖ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రతిపాదనలు లేవు. ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. సమష్టిగా పనిచేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం.

– కె.హేమావతి, జోనల్ కమిషనర్, జోన్–8

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

భూసేకరణలో అభ్యంతరాలపై గ్రామసభ



గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో అయేషా

పరవాడ: మారేడుపూడి–వల్లూరుకు రహదారి నిర్మాణం కోసం భూసేకరణలో అభ్యంతరాలుంటే రైతులు ముందుకు రావాలని అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా కోరారు. భూసేకరణపై సాలాపువాని పాలెంలో గురువారం రైతులతో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. రహదారి నిర్మాణానికి రైతుల నుంచి 2.80 ఎకరాల భూముల్ని ఏపీఐఐసీ సేకరించనున్నట్లు తెలిపారు. భూసేకరణలో రైతులకు సంబంధించిన పట్టా నంబర్లు, పేర్లు, రెవెన్యూ పరమైన సమస్యలపై అభ్యంతరాలు తెలిపితే వాటిని సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల నుంచి సేకరించిన భూములకు తగిన నష్టపరిహారం చెల్లింపులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామ సభలో రైతుల నుంచి రెవెన్యూ పరమైన సమస్యలపై 10 అభ్యంతరాలను అధికారులు స్వీకరించారు. పరవాడ తహసీల్దార్ బి.నాగరాజు, ఏపీఐఐసీ అధికారులు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఆందోళన

పరవాడ: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని సిటుజిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిటు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దుచేసి నాణ్యమైన 5జి ఫోన్లు మంజూరు చేసి, గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి ఎం.రమణి మాట్లాడుతూ నెట్వర్క్ సక్రమంగా లేకపోవడం, సర్వర్లు పనిచేయకపోవడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచి, యాప్‌లన్నీ ఒకే యాప్‌గా మార్చు చేయాలన్నారు. గ్రాట్యుటీ జీవోలో మార్పులు చేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు గైడ్‌లైన్స్ రూపొందించాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనకు దిగుతామని యూనియన్ గౌరవ అధ్యక్షురాలు సీహెచ్ దేవి హెచ్చరించారు. అంగన్‌వాడీల సమస్యలపై తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రమేష్ నాయుడులకు వినతి పత్రాలు అందించారు. ఆందోళనలో నీలిమ, అమ్మాజీ, భవానీ, అరుణ, దేవి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

'అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం'



సబ్బవరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సబ్బవరం: అంగన్‌వాడీలకు కనీస వేతనాలను అమలు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌లను రద్దు చేయాలని సిటు జిల్లా కోశాధికారి రమణమ్మ డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట తమ డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించి, సీడీపీవో లలితకుమారికి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ యూనియన్లను చర్చలకు పిలిచి, సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్‌లో పోరాటాలు చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల యూనియన్ సభ్యులు వరలక్ష్మి, శివరామలక్ష్మి తదితరులు ఉన్నారు.

రామయ్యనాయుడు మృతికి సంతాపం

పరవాడ: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు సోదరుడు, కాంగ్రెస్ సీనియర్ నేత కేఎస్ఏ రామయ్యనాయుడు పార్థివ దేహానికి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ, యలమంచిలి మాజీ ఎమ్మెల్యే పప్పల చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు బంధం నాగేశ్వరరావు, నాయకులు చుక్క రామునాయుడు, వెన్నల సన్యాసిరావు, పైల అప్పలనాయుడు, బొండా కనకరావు, గొర్లి గోపి, పెదిశెట్టి శేఖర్, కావలి వాసు, అశోక్, పల్లా గోవిందు తదితరులు ఉన్నారు.



రామయ్యనాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ నేతలు

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



రాజశేఖర్

పెందుర్తి: చినముషిడివాడ పాతూరు సమీపంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చినముషిడివాడ పరదేశిమాంబ ఆలయం సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఉద్దండరావు రాజశేఖర్(36) ఈ ఏడాది మే 25న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మూడు నెలలైనా ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో తండ్రి చంద్రశేఖరరావు పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు జరుగుతోంది.

వాల్మీకి రామాయణంపై న్యాయ విద్యార్థులకు అవగాహన

సబ్బవరం: వాల్మీకి రామాయణం ద్వారా నైతిక న్యాయ శాస్త్రాన్ని అన్వేషించవచ్చని వాల్మీకి రామాయణ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య హనుమంతు లజపతిరాయ్ తెలిపారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో గురువారం వాల్మీకి రామాయణంలో ధర్మం, న్యాయ పునాదుల పరిపాలన అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాల్మీకి రామాయణ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో విజయనగరంలోని రామనారాయణంలో వచ్చే నెల 20న నిర్వహించనున్న శ్రీరామాయణ శంఖారావం న్యాయ సమ్మేళనంలో వర్సిటీ విద్యార్థులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య డాక్టర్ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రామాయణంలోని ప్రతిపాదిత న్యాయ సూత్రాలను విశ్వవిద్యాలయ లా సిలబస్‌లో ప్రత్యేక పేపర్‌గా పెట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో న్యాయ విభాగం అసిస్టెంట్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



న్యాయ విద్యార్థులకు వాల్మీకి రామాయణంపై అవగాహన కల్పిస్తున్న ఆచార్య హనుమంతు లజపతిరాయ్

వినాయక నిమజ్జనాలకు చెరువుల పరిశీలన

- శాంతి భద్రతలు, రక్షణకు ప్రజలు సహకరించాలి
- వెస్ట్ జోన్ ఏసీపీ పృథ్వితేజ సూచనలు

పెందుర్తి: వినాయక చవితి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వెస్ట్ జోన్ ఏసీపీ ఏబీ పృథ్వితేజ సూచించారు. శాంతి భద్రతలను కాపాడే బాధ్యత ప్రజలు, ఉత్సవ కమిటీలు తీసుకుని పోలీసులకు సహకరించాల్సిందిగా కోరారు. పెందుర్తి ప్రాంతంలో వినాయక నిమజ్జనం కోసం ప్రతిపాదించిన పినగాడిలోని పెంటవాని చెరువు(వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద), పెందుర్తి పెద్ద చెరువు, సరిపల్లి చెరువులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకచవితి నుంచి ప్రతి రోజూ ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూడాలని యంత్రాంగానికి సూచించారు. మండపాలకు ఖచ్చితంగా అనుమతి ఉండాలన్నారు. ఉత్సవాల పేరిట అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. జీవీఎంసీ జోన్–8 కమిషనర్ కె.హేమావతి, ట్రాఫిక్ సీఐ కె.సురేష్‌కుమార్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ ఎస్ఐలు నరసింగరాజు, భాస్కరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నిమజ్జనానికి ప్రతిపాదించిన చెరువుల్ని పరిశీలిస్తున్న వెస్ట్ జోన్ ఏసీపీ పృథ్వితేజ, జెడ్సీ హేమావతి

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పెదగంట్యాడ: మదీనాబాగ్, పాలవలస 11కేవీ ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మదీనాబాగ్ ఫీడర్ పరిధిలోని మదీనాబాగ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం బిల్డింగ్స్, పాలవలస ఫీడర్ పరిధిలోని మద్దివానిపాలెం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, దేవాడ, అప్పికొండ, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, మురుభాయ్, పాలవలస, గొల్లపేట, ఈసరపువానిపాలెం, యలమంచిలిదొడ్డి, గిన్నిపాలెం, నక్కదొడ్డి తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

గాజువాక: గాజువాక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పంతులుగారి మేడ, జోగవానిపాలెం, పాతగాజువాక, నీల్‌కమల్ వీధి, భానోజీతోట, సత్తెమ్మతల్లి గుడి, సంజీవగిరి కాలనీ, డిఫెన్స్ కాలనీ, బీసీ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

మంచినీటి సమస్య పరిష్కరించాలని ధర్నా

కూర్మన్నపాలెం: మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ 87వ వార్డు ప్రజలు గురువారం ధర్నా నిర్వహించారు. వార్డులోని సిద్ధార్థనగర్ 12 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద చేపట్టిన ధర్నాలో అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మంచినీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో టీడీపీ నాయకులు పాల్గొనడం గమనార్హం. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించే సమయానికి కేవలం రెండు వార్డుల్లో 25 వేల జనాభా మాత్రమే ఉండేదని, ప్రస్తుతం 65 వేలకు చేరిందన్నారు. ఆటోనగర్‌లోని పరిశ్రమలకు కూడా సిద్ధార్థనగర్ ప్లాంట్ నుంచే మోటార్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారన్నారు. 86, 87 వార్డుల్లోని ప్రజలు స్లేటుల్లో నీళ్లు పట్టి బిందెల్లో వేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మరో 12 ఎంఎల్‌డీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించాలని, ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు 70 హెచ్‌పీ మోటార్లు అమర్చి నీరు అందించాలని స్థానికులు కోరారు.



సిద్ధార్థనగర్ వాటర్ ప్లాంట్ వద్ద ధర్నా చేస్తున్న 87వ వార్డు ప్రజలు

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు అన్యాయం

పరవాడ: పరిశీలన పేరిట కూటమి ప్రభుత్వం అర్హుల పింఛన్లను తొలగించడం అన్యాయమని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు ఆరోపించారు. గురువారం పరవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాదికి పైగా కాలంలో.. కొత్త పింఛన్లు మంజూరు చేయకపోగా ఉన్నవాటిని పరిశీలన పేరిట తొలగించడం దురదృష్టకరమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భర్త చనిపోతే భార్యకు వెంటనే పింఛన్ మంజూరు చేసేదని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని ఆక్షేపించారు. వైకల్యం తక్కువగా ఉందని వేలాది పింఛన్లను రద్దు చేయాలనుకోవడం సరికాదన్నారు. మంచానికి పరిమితమై రూ.15 వేల పింఛన్ పొందుతున్న వికలాంగులకు వైకల్య శాతం తగ్గించి రూ.6 వేలు మంజూరు చేయడం అన్యాయమన్నారు. గత ఎన్నికల్లో ఇబ్బడిముబ్బడిగా హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల్లో కోత విధించడం ప్రజల్ని మోసం చేయడమేనని పేర్కొన్నారు. తొలగించిన పింఛన్లను తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న కృష్ణంనాయుడు

రహదారిపై స్క్రాప్ దుకాణంతో ఇబ్బందులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు సిద్ధార్థనగర్ ప్రధాన రహదారిపై స్క్రాప్ దుకాణం ఏర్పాటు చేసి రాత్రి పగలూ అనే తేడా లేకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారు. కాగితాలు ఏరుకునే వారు, ఇనుప ముక్కలు తెచ్చేవారు అక్కడే తిష్ట వేస్తుండటం వల్ల చీకటి పడితే మహిళలు అటుగా వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. చెత్తాచెదారం, ఇనుప రేకులు, ముక్కలు అక్కడే వేయడం వల్ల చీకట్లో అవి తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. సమీపంలోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉందని, అలాంటి దగ్గర స్క్రాప్ దుకాణం నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విశాలమైన రహదారిలో నిత్యం అటు ఉద్యోగులు.. ఇటు ఆటోనగర్‌లో పనిచేసే కార్మికులు తిరుగుతుంటారని చెబుతున్నారు. అటువంటి రహదారిని ఆక్రమించి దుకాణాలు పెట్టడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై స్క్రాప్ దుకాణాన్ని వెంటనే తొలగించాలని పలువురు కోరుతున్నారు.



సిద్ధార్థనగర్ ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న స్క్రాప్ దుకాణం

రేపటి నుంచి సంగీత నృత్యోత్సవాలు

మద్దిలపాలెం: కళలకు నెలవైన కళాభారతి ప్రాంగణంలో ఈ నెల 23 నుంచి 28 వరకు ఆరు రోజుల పాటు సంగీత, నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్ రాజు, రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కళాభారతి ఆడిటోరియంలో ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. ఈ నెల 23న ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌రావుకు 'నాద విద్యా భారతి' బిరుదు, రూ.లక్ష నగదు, రూ.2.5 లక్షల విలువైన స్వర్ణ కమలంను గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు చేతుల మీదుగా అందిస్తారు. అనంతరం ద్వారం సత్యనారాయణచే వాయులీన కచేరీ ఉంటుంది. 24న హిందుస్థానీ, కర్ణాటక గాత్ర సంగీతంలో పూర్ణిక కృష్ణన్ (ముంబయి), నివేదిత భట్టాచార్య(కోల్‌కతా)ల జుగల్బందీ జరుగుతుంది. 25న ప్రముఖ కర్ణాటక గాత్ర విద్వాంసులు విష్ణుభట్ల సిస్టర్స్ యుగళ ప్రదర్శన ఏర్పాటు చేశారు. 26న బెంగళూరు బ్రదర్స్‌చే కర్ణాటక గాత్ర సంగీత కచేరీ, 27న డాక్టర్ ఆర్. వసంత కిరణ్ ఆధ్వర్యంలో 33 మంది కళాకారులు 'హరిలీలా కల్పతరువు'అనే కూచిపూడి నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తారు. 28న డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి 'శ్రీ ఖడ్గ తిక్కన'అనే గొప్ప చారిత్రక పద్య నాటకాన్ని 38 మంది నటీనటులు ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమాలకు ప్రవేశం ఉచితం. అకాడమీ కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, గ్రంధి మల్లికా మనోజ్ పాల్గొన్నారు.